ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
జాతీయ వార్తలు
తేదీ: 06-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు
ముఖ్యాంశాలు

- దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపే సామర్థ్యం ఈశాన్య రాష్ట్రాలకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- మానవుల సర్వతోముఖాభివృద్ధికి విద్య ఒక్కటే మార్గమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- డాక్టర్ భీమ్ రావ్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహాపరినిర్వాణ దివస్ సందర్భంగా ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి ఆయనకు నివాళులర్పించారు.
- అసత్య సమాచార వ్యాప్తిని నియంత్రించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు చేపడుతుందని కేంద్ర మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ అన్నారు.
- అండర్-19 ఆసియా కప్ క్రికెట్ మ్యాచుల్లో భారత జట్టు ఫైనల్‌కు చేరింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మానవుల సర్వతోముఖాభివృద్ధికి విద్య ఒక్కటే మార్గమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఒడిస్సా లోని మయూర్‌భంజ్ జిల్లాలోని ఉపర్‌బెడ ప్రభుత్వ హయ్యర్ ప్రైమరీ ప్రాథమిక పాఠశాల విద్యార్థినులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ, ఉపాధి పొందడం ఒక్కటే ధ్యేయం కాకుండా, విద్యార్థులు విద్య ద్వారా అపారమైన జ్ఞానాన్ని సంపాదించుకోవాలని, అది ఒక వ్యక్తిని అభ్యున్నతి దిశగా నడిపిస్తుందని పేర్కొన్నారు. ఒడిశాలో ఐదు రోజుల పర్యటనలో ఉన్న రాష్ట్రపతి , దేశంలోనే అత్యున్నత పదవిని చేపట్టిన తర్వాత తొలిసారిగా ఈరోజు తన స్వగ్రామమైన ఉపర్‌బెదకు చేరుకున్నారు. రాష్ట్రపతి రేపు బంగ్రిపోసి వద్ద బంగిరిపోసి నుండి గోరుమహిసాని, బాదంపహాడ్ నుండి కియోంజర్, బుడమోరా నుండి చకులియా వరకు మూడు రైల్వే లైన్లను ప్రారంభించనున్నారు. అలాగే, రేపు తన పర్యటన చివరి రోజున రాయరంగ్‌పూర్ గిరిజన పరిశోధనా కేంద్రం, దండ్ బోస్ విమానాశ్రయం అభివృద్ధి, రాయ్‌రంగ్‌పూర్ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ వైద్య సదుపాయంగా మార్చడానికి శంకుస్థాపన చేస్తారు.

======================

దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపే అపారమైన సామర్థ్యం ఈశాన్య రాష్ట్రాలకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో అష్టలక్ష్మి మహోత్సవాన్ని ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈశాన్య రాష్ట్రాల రైతులు, చేతివృత్తులు, హస్త కళాకారులతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులకు ఈ కార్యక్రమం గొప్ప అవకాశం అన్నారు. అష్టలక్ష్మి మహోత్సవం ఈశాన్య రాష్ట్రాల ఉజ్వల భవిష్యత్తుకు మంచి వేదిక అని, విక్షిత్ భారత్ మిషన్‌ను ముందుకు తీసుకువెళ్లేందుకు ఇది దోహదపడుతుందని ప్రధాని పేర్కొంటూ..

(వాయిస్... 40 సెకన్లు)

ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, ఉత్పత్తులకు ప్రచారం కల్పించే లక్ష్యంతో మూడు రోజుల పాటు జరిగే ఈ అష్టలక్ష్మి మహోత్సవంలో ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, హస్తకళలు, పర్యాటక అవకాశాలు, ప్రత్యేకమైన ఉత్పత్తులను ప్రదర్శిస్తారు.

======================

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్ రావ్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహాపరినిర్వాణ దివస్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆయనకు నివాళులర్పించారు. సామాజిక న్యాయానికి ఆయన మార్గదర్శిగా నిలిచారని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. సమానత్వం, మానవ గౌరవం కోసం అంబేద్కర్ చేసిన అలుపెరగని పోరాటం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని, ఆయన ఆశయాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నరేంద్రమోదీ అన్నారు. అలాగే ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్, జగదీప్ ధనఖర్ పార్లమెంట్ లోని ప్రేరణ స్థల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లోకసభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు, పలువురు కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే తదితరులు అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

======================

మండలం-మకరవిళక్కు వార్షిక యాత్ర సందర్భంగా శబరిమలకు విచ్చేస్తోన్న అయ్యప్ప భక్తులు సులభంగా దర్శనం చేసుకునేందుకు వీలుగా కేరళ పోలీసులు ప్రత్యేక పోర్టల్‌ను ప్రవేశపెట్టారు. 'శబరిమల-పోలీస్ గైడ్' పేరుతో ఆంగ్ల భాషలో

అందుబాటులో ఉండే ఈ పోర్టల్‌లో భక్తులకు ఉపయోగపడే ముఖ్యమైన సమాచారాన్నంతా పొందుపరిచారు. పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లు, పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్లు, ఆరోగ్య సేవలు, కేఎస్ఆర్టీసీ, అంబులెన్సు, అగ్నిమాపక దళం, ఆహార భద్రతకు చెందిన సమాచారం ఈ పోర్టల్‌లో అందుబాటులో ఉంటుంది. వీటితోపాటు శబరిమల చరిత్ర, వాహనాల పార్కింగ్, ప్రతి జిల్లా నుంచి శబరిమలకు ఉన్న వాయు, రైలు, రోడ్డు మార్గాల వివరాలను ఇందులో పొందుపరిచినట్లు పోలీసు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

===========================

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కీలక వడ్డీరేట్లను వరుసగా 11వ సారి యథాతథంగా ఉంచిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుల్లో నగదు లభ్యత సమస్యలను పరిష్కరించేందుకు నగదు నిల్వల నిష్పత్తి(Cash Reserve Ratio)ని 4.5 శాతం నుంచి 4 శాతానికి తగ్గించింది. దీంతో బ్యాంకులు మరిన్ని రుణాలు మంజూరు చేసేందుకు వీలు కల్పించినట్లయ్యింది. ఈమేరకు ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ ఈరోజు వెల్లడిస్తూ.. సీఆర్ఆర్ (CRR)ను తగ్గించామనీ, ఈ నిర్ణయంతో అదనంగా 1.16 లక్షల కోట్ల నిధులను బ్యాంకింగ్ వ్యవస్థలోకి పంపించినట్లవుతుందని తెలిపారు. అటు రైతులకు తనఖాలేని రుణాల పరిమితిని కూడా పెంచామని గవర్నర్ శక్తికాంత దాస్ వివరిస్తూ...

(వాయిస్.. 30 సెకన్లు)

===========================

ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసి సమాజంలో సమస్యలు సృష్టించే అసత్య సమాచార వ్యాప్తిని నియంత్రించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు చేపడుతుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ అన్నారు. ఈరోజు రాజ్యసభలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ వివిధ ప్రసార మాధ్యమమాలలో వెలువడే నకిలీ వార్తలను నిలువరించేందుకు ప్రభుత్వం చట్టబద్ధమైన సంస్థాగత యంత్రాంగాలను కలిగి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అవాస్తవ వార్తలను ఎదుర్కోవడానికి 2019లో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్‌లలోని అధీకృత మూలాల నుండి వచ్చిన వార్తల ప్రామాణికతను ధృవీకరించిన తర్వాత, ఇది సామాజిక మాధ్యమాలలో సరైన సమాచారాన్ని ప్రసారంచేస్తుందని తెలిపారు. వార్తాపత్రికలు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీసుకువచ్చిన ప్రవర్తనా నిబంధనలకు కట్టుబడి ఉండాలని, నకిలీ, పరువు నష్టం కలిగించే అసత్య వార్తలను ప్రచురించడాన్ని నిరోధించాలని మురుగన్ అన్నారు.

===========================

ఉక్రెయిన్-రష్యా దేశాల మధ్య యుద్ధం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో తమను తాము రక్షించుకునేందు రష్యా ఏ చర్యకైనా సిద్ధంగా ఉందని ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ పేర్కొన్నారు. కీవ్‌పై హైపర్‌సోనిక్ క్షిపణిని ప్రయోగించినట్లు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల పేర్కొన్న క్రమంలో పశ్చిమ దేశాలు నుండి రష్యా విమర్శలను ఎదుర్కొంది. ఈ నేపథ్యంలోనే అమెరికాతో సహ దాని మిత్ర దేశాలు రష్యాను వ్యూహాత్మకంగా ఓడించాలని యోచిస్తున్నాయని, దాన్ని ఎదురుకొనేందుకు ఎలాంటి మార్గాన్నైనా అనుసరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని లావ్రోవ్ తెలిపారు. కాగా రెండు వారాల క్రితం రష్యా తమపై ఖండాంతర క్షిపణితో దాడి చేసిందని ఉక్రెయిన్ ఆరోపించింది. అయితే, తాము ఖండాంతర క్షిపణిని ప్రయోగించలేదని, నూతనంగా అభివృద్ధి చేసిన ఒరెషిక్ అనే హైపర్‌సోనిక్ బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించామని రష్యా పేర్కొంది. అమెరికా, బ్రిటన్ దేశాల అండతో ఉక్రెయిన్ దాడులకు పాల్పడితే.. కీవ్‌తో పాటు దానికి మద్దతిచ్చిన దేశాలకు గట్టిగా బదులిచ్చేందుకు దీన్ని అభివృద్ధి చేసినట్లు మాస్కో వెల్లడించింది.

===========================

రాజ్యసభలో నిన్న సాధారణ తనిఖీలలో కరెన్సీ నోట్లు గుర్తించినట్లు ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వెల్లడించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా ఈరోజు రాజ్యసభలో ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ.. ‘‘నిన్న సభను వాయిదా వేసిన తర్వాత భద్రతా అధికారుల ఛాంబర్‌లో సాధారణ తనిఖీలు చేపట్టారని, ఈ క్రమంలో సీటు నంబర్ 222 నుండి అధికారులు కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

===========================

షార్జాలో జరుగుతున్న అండర్-19 ఆసియా కప్ క్రికెట్ మ్యాచుల్లో భారత జట్టు ఫైనల్‌కు చేరింది. ఈరోజు శ్రీలంకతో జరిగిన సెమీస్‌లో భారత జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 46.2 ఓవర్లో 173 పరుగులకు మొత్తం వికెట్లను కోల్పోగా, ఈ లక్ష్యాన్ని భారత్ 3 వికెట్లు కోల్పోయి 21.4 ఓవర్లలో ఛేదించింది. ఆదివారం దుబాయ్ వేదికగా జరిగే ఫైనల్‌లో భారత్, బంగ్లాదేశ్ తలపడనున్నాయి.

===========================

===========================